క్లుప్తంగా

జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం

పరవాడ: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ అడ్మిషన్లు ప్రారంభించినట్లు ప్రిన్సిపాల్ నారాయణరావు తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు కళాశాలలో బైపీసీ, ఎంపీసీ, హెచ్ఈసీ, సీఈసీ గ్రూపుల్లో చేరడానికి అవకాశం ఉందని చెప్పారు. టెన్త్ క్లాసు పరీక్షల్లో 550 మార్కులు సాధించిన విద్యార్థులకు రామదాస్ ఫౌండేషన్ స్కాలర్‌షిప్‌లు మంజూరు చేస్తుందన్నారు. ఎనీబీసీ సౌజన్యంతో విద్యార్థులకు ఉచిత కంప్యూటర్ శిక్షణ కల్పిస్తామన్నారు. అర్హులైన విద్యార్థులు కళాశాలలో చేరి, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 9 మంది ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో విస్తం ప్రతినిధులు

పెందుర్తి: పెందుర్తి మండలం పినగాడి సమీపంలోని విస్తం ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 9 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. యోకోమో కంపెనీలో 9 మంది డిప్లొమా కోర్సులు అభ్యసిస్తున్న విద్యార్థులకు కొలువులు లభించినట్లు డిప్లొమా ప్రిన్సిపాల్ కె.వి.కిరణ్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ఇంజినీరింగ్ విభాగం ప్రిన్సిపాల్ డాక్టర్ బి.వి.శివకుమార్ ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్లేస్‌మెంట్ అధికారులు ఇ.కిరణ్‌కుమార్, ఎం.వి.జె.టి అరుణ్, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు



చిత్రాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

సబ్బవరం: వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరంలో భాగంగా విద్యార్థులకు సబ్బవరం శాఖా గ్రంథాలయంలో బుధవారం చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పలు పాఠశాలల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వారు గీసిన చిత్రాలు ఆకట్టుకున్నాయి. అనంతరం విద్యార్థులతో పుస్తకాలు, పేపర్ పఠనం చేయించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి వి.శిరీష తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల బడిబాటకు ప్రత్యేక సర్వే



సర్వే చేస్తున్న ఎంఈవో శ్రీనివాస్, ఐఈఆర్పీలు

పెదగంట్యాడ: దివ్యాంగులను బడిబాట పట్టించే దిశగా చర్యలు తీసుకోవాలనే ఉద్దేశంతో రాష్ట్ర జిల్లా సంచాలకుల ఆదేశానుసారం ప్రత్యేక సర్వేను నిర్వహిస్తున్నట్లు భవిత కేంద్రం ఐఈఆర్పీలు రవి, జయభారతి తెలిపారు. మండలంలోని పలు ప్రాంతాల్లో బుధవారం ఇంటింటి సర్వే నిర్వహించారు. వారు మాట్లాడుతూ మండల విద్యాశాఖాధికారి శ్రీనివాసరావు పర్యవేక్షణలో జూన్ 9 వరకు సర్వే సాగుతుందన్నారు. ఈ సర్వేలో భాగంగా చదువులకు దూరంగా ఉన్న ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించి, వారికి చదువు వలన కలిగే ప్రయోజనాలు, దివ్యాంగుల సంక్షేమానికి అమలవుతున్న రాయితీలు, సదుపాయాలను తల్లిదండ్రులకు వివరించినట్లు చెప్పారు. ఈ సర్వేలో 12 మంది పిల్లలను గుర్తించామన్నారు.

బుద్ధ పూర్ణిమ వేడుకలు నేడు

పెదగంట్యాడ: జీవీఎంసీ 76వ వార్డు బర్మా కాలనీలో ఈ నెల 23న బుద్ధ పూర్ణిమను నిర్వహించనున్నామని బర్మా ఆంధ్ర బౌద్ధ సంఘం చైర్మన్ బోర వేణుగోపాల్ గౌతమ్ తెలిపారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య పాల్గొనున్నారన్నారు. ఈ సందర్భంగా బౌద్ధ పతాకాన్ని ఆవిష్కరించనున్నామని, అలాగే బుద్ధ వందనం, దమ్మ సందేశం, దమ్మ దీక్ష తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నామని చెప్పారు. పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వైభవంగా నృసింహ జయంతి

- సింహగిరిపై సాయంసంధ్య వేళ ప్రత్యేక పూజలు
- నృసింహ వనంలో విశేష ఆరాధన



నృసింహవనంలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు, పాల్గొన్న ఈవో శ్రీనివాసమూర్తి దంపతులు

సింహాచలం: నృసింహ జయంతిని సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో బుధవారం సాయంత్రం కనులపండువగా నిర్వహించారు. స్వామివారు ఆవిర్భవించిన సాయం సంధ్యావేళ ఈ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. ముందుగా సాయంత్రం 5 గంటలకు దర్శనాలు నిలుపుదల చేసి, ఆలయ సంప్రోక్షణ చేశారు. అనంతరం అంతరాలయంలో స్వామివారి మూలవిరాట్ చెంతన విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం, పంచకలశ స్నపనం, అర్చన నిర్వహించారు. అనంతరం క్షేత్రమహాత్మ్యంలో ఉన్న నృసింహ ఆవిర్భావ ఘట్ట పురాణ విన్నపం చేశారు. అనంతరం నమ్మాళ్వార్ తిరునక్షత్ర పూజలు, దివ్యప్రబంధ సేవాకాలం, నివేదన, సీతలోపచారాలు, మంగళాశాసనం, ఏకాంతసేవ నిర్వహించారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, అర్చకులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

అప్పన్న గోశాలలో..

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన శ్రీకృష్ణాపురంలోని గోశాలలో బుధవారం నృసింహ జయంతిని దేవస్థానం వైదిక, అధికార వర్గాలు వైభవంగా నిర్వహించాయి. నృసింహవనంలోని కొండపై వేంజేసిన భారీ నృసింహస్వామి, ప్రహ్లాదుడి విగ్రహం వద్ద ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పాంచరాత్ర ఆగమశాస్త్రాన్ని అనుసరించి సాయంత్రం నాలుగు గంటల నుంచి అర్చకులు విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, షోడశోపచార పూజలు నిర్వహించారు. అనంతరం నృసింహ ఆవిర్భావ ఘట్ట విన్నపాన్ని చేశారు. తదుపరి స్వామి వారి అష్టోత్తర పూజ చేశారు. నమో నారసింహా అంటూ స్వామికి విశేషంగా హారతులిచ్చారు. భక్తులు కార్యక్రమంలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి దంపతులు, దేవస్థానం మాజీ ట్రస్ట్ బోర్డు సభ్యుడు గంట్ల శ్రీనుబాబు పాల్గొన్నారు.

మార్మోగిన గోవింద నామస్మరణ

భక్తిశ్రద్ధలతో గిరి ప్రదక్షిణ



గిరి ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు

ఉక్కునగరం: వైశాఖ పౌర్ణమిని పురస్కరించుకుని స్థానిక సెక్టార్–1లో వేంకటేశ్వరస్వామి కొలువుదీరిన ఆలయ గిరిప్రదక్షిణ వైభవంగా సాగింది. సాయంత్రం ఆరు గంటల నుంచి ప్రారంభమైన కార్యక్రమంలో గోవింద నామస్మరణతో గిరి మార్మోగింది. ఆలయ అర్చకులు భావనారాయణ స్వామి, హరి స్వామి నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. అంతకు ముందు వేకువజామున స్వామివారికి ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. అనంతరం భక్తులు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

రేపు విద్యుత్తు ఉండని ప్రాంతాలు

సబ్బవరం: సబ్బవరం సెక్షన్–1 పరిధిలోని 33/11 కేవీ సబ్బవరం విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్వహణలో భాగంగా సంబంధిత ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఈపీడీసీఎల్ ఈఈ ఎస్.రామకృష్ణ తెలిపారు. ఈ కారణంగా సబ్బవరం మేజర్ పంచాయతీ పరిధిలోని గ్రామాలతో పాటు తవ్వవానిపాలెం, అమృతపురం, గొల్లలపాలెం, పైడివాడ, అసకపల్లి, ఇరువాడ, పల్లవానిపాలెం, జాగరపువానిపాలెం గ్రామాల్లో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని పేర్కొన్నారు. వినియోగదారులు గమనించాలని కోరారు.

జీవవైవిధ్యంతోనే మానవాళి మనుగడ



సదస్సులో పాల్గొన్న శిక్షణార్థులు, నిర్వాహకులు

విశాఖ విద్య : మానవాళి మనుగడకు జీవవైవిధ్యాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ప్రభుత్వ డైట్ కాలేజీ సీనియర్ అధ్యాపకులు, ప్రముఖ ఉపన్యాసకులు గొట్టేటి రవి అన్నారు. టెక్నికల్ టీచర్ ట్రెనింగ్ శిక్షణలో భాగంగా బుధవారం వన్‌టౌన్‌లోని క్వీన్ మేరీ ప్రభుత్వ బాలికల పాఠశాలలో జిల్లా స్థాయి సదస్సు నిర్వహించారు. జీవ వైవిధ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా సైన్స్ అధికారి కప్పల ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రవి మాట్లాడుతూ కాబోయే ఉపాధ్యాయులు ప్రకృతి పరిరక్షణ, దాని వినియోగం గురించి పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలన్నారు. విద్యార్థులను తీర్చిదిద్దే క్రమంలో ఉపాధ్యాయులందరికీ జీవ వైవిధ్యంపై విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా జీవ వైవిధ్యాన్ని కాపాడాలంటూ శిక్షణార్థులతో ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాకినాడకు చెందిన పర్యావరణ కార్యకర్త కేసరి శ్రీనివాసరావు, ఉపాధ్యాయుడు డో నష్టాన్ని ఆపడానికి కృషి చేయాలని కోరారు. జీవ వైవిధ్య పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ 10 మొక్కలు నాటి పెంచే కార్యక్రమాన్ని మొదలుపెట్టాలన్నారు. ఏవీఎన్ డిగ్రీ కళాశాల లెక్చరర్ అర్చన మాట్లాడుతూ సముద్రం మన భవిష్యత్ ఆహార కేంద్రమని పేర్కొన్నారు. సముద్ర జీవరాశిని కూడా కాపాడటం మన బాధ్యతన్నారు. నడుపూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాచకొండ శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులను జీవ వైవిధ్య పరిరక్షణ ప్రణాళికలో భాగస్వామ్యం చేస్తున్నామని తెలిపారు. సిప్రా ట్రస్ట్ సీఈవో డాక్టర్ శశిప్రభ మాట్లాడుతూ రాష్ట్రంలో 14 వేల మంది విద్యార్థులకు గ్రీన్ అంబాసిడర్స్‌గా శిక్షణ ఇచ్చామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్న 80 శాతం ప్రజలు ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ కోసం సంప్రదాయ మొక్కల ఆధారిత మందులపై ఆధార పడుతున్నారన్నారు. కార్యక్రమంలో యాక్షన్ ఎయిడ్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఇర్ఫాన్, మురళీనగర్ గార్డెనింగ్ ప్రతినిధులు ఉదయ్‌కుమార్, మళ్ల సరిత, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు హరి, భాస్కర్, పంతుల లలిత, శివలక్ష్మి, గ్రీన్ క్లైమేట్ వ్యవస్థాపక కార్యదర్శి జె.వి.రత్నం తదితరులు పాల్గొన్నారు.

ప్రజా భాగస్వామ్యంతోనే పరిరక్షణ



మాట్లాడుతున్న రిటైర్డ్ వీసీ సుంకరి రామకృష్ణారావు

సీతంపేట: జీవ వైవిధ్య పరిరక్షణ ప్రణాళికలో ప్రతి ఒక్కరూ భాగం కావాలని కృష్ణా విశ్వవిద్యాలయం విశ్రాంత ఉపకులపతి సుంకరి రామకృష్ణారావు పిలుపునిచ్చారు. జీవ వైవిధ్య దినోత్సవం సందర్భంగా యాక్షన్ ఎయిడ్ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్లోబల్ బయోడైవర్సిటీ ఫ్రేమ్ వర్క్ అమలుకు మద్దతు ఇవ్వడం ద్వారా జీవ వైవిధ్య

ఎరుకుమాంబ ఆలయానికి పోటెత్తిన భక్తులు



అమ్మవారి దర్శనం కోసం క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు



ఎరుకుమాంబ అమ్మవారికి జలాభిషేకం చేస్తున్న భక్తులు

సీతమ్మధార : బుధవారం దొండపర్తిలోని ఎరుకుమాంబ అమ్మవారికి భక్తులు పెద్ద ఎత్తున జలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు దొండపర్తి, నెహ్రూబజార్, రైల్వే న్యూకాలనీ, పెదవాల్తేరు, మద్దిలపాలెం, అక్కయ్యపాలెం, శివాజీపాలెం, ఎన్ఏడీ, సీతమ్మధార, నక్కవానిపాలెం, రేసవానిపాలెం, జగదాంబ, వన్‌టౌన్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చారు. ప్రధాన అర్చకులు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పంచామృతాభిషేకంతో పాటు అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. అలాగే సాయంత్రం కూడా భక్తులు అమ్మవారికి జలాభిషేకం చేశారు. పలు రకాల పూలతో అమ్మవారిని అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అలరించిన మెగా సుస్వరాభిషేకం



సంగీత విభావరిని ప్రారంభిస్తున్న శ్రీనుబాబు తదితరులు

సీతంపేట: చిరంజీవి కళా పరిషత్ ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో బుధవారం రాత్రి నిర్వహించిన మెగా సుస్వరాభిషేకం ప్రేక్షకులను ఉర్రూతలూగించింది. ఈ సందర్భంగా పలువురు గాయనీ గాయకులు చిరంజీవి నటించిన చిత్రాల్లోని పాటలను పాడి అలరించారు. కార్యక్రమాన్ని కార్పొరేటర్ కందుల నాగరాజు, సింహాచలం దేవస్థానం ధర్మకర్తల మండలి మాజీ సభ్యుడు గంట్ల శ్రీనుబాబు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. శ్రీనుబాబు మాట్లాడుతూ చిరంజీవి పేరిట అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్న కళా పరిషత్ సేవలు అభినందనీయమన్నారు. సంస్థ అధ్యక్షుడు గెంబలి జగదీష్, గౌరవాధ్యక్షులు విజయరమణి, గీత్ క్రియేషన్స్ ఖాన్, సన్ మూర్తి, చెన్నా తిరుమలరావు, రవితేజ భయ్యా శ్రీనివాస్ పాల్గొన్నారు.

'ఉక్కు'ను కాపాడుకోవాలి

అగనంపూడి: విశాఖ స్టీల్‌ప్లాంట్ ఆంధ్రప్రదేశ్‌కు వెన్నెముక వంటిదని ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకుడు పి.నీలకంఠం అన్నారు. అటువంటి కర్మాగారాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెంలోని రిలే దీక్షా శిబిరంలో 1196వ రోజు, మంగళవారం ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రపంచ పటంలో విశాఖ ఓ స్థానాన్ని దక్కించుకుందంటే కేవలం విశాఖ స్టీల్‌ప్లాంట్ వల్లే అన్నారు. అటువంటి స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో పెట్టడానికి కేంద్రం కుయుక్తులు పన్నుతోందని, వెంటనే వీటిని అడ్డుకోకపోతే రాష్ట్ర ప్రజలకు తీరని నష్టం వాటిల్లడం ఖాయమని అన్నారు. ప్రైవేటీకరణను సమష్టిగా అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

నృసింహావతారంలో బల్లిగిరి వెంకన్న



నృసింహావతారంలో ప్రసన్న వేంకటేశ్వరస్వామి

అల్లిపురం : బల్లిగిరి శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి బుధవారం భక్తులకు నృసింహావతారంలో దర్శనమిచ్చారు. స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు తెల్లవారు జాము నుంచి బారులు తీరారు. నృసింహ జయంతిని పురస్కరించుకుని ఆలయానికి భక్తుల తాకిడి పెరిగింది. ఆలయ అర్చకుడు గొడవర్తి వీర రాఘవాచార్యులు ఆధ్వర్యంలో స్వామికి ప్రత్యేక అలంకరణ, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తుల గోత్రనామాలతో అభిషేకాలు, సహస్ర నామాభిషేకాలు జరిపారు. స్వామి వారికి భక్తులు కొత్త మామిడి పండ్లు నివేదించారు.

నేడు చక్రస్నానం.. కల్యాణోత్సవాల్లో భాగంగా గురువారం బల్లిగిరి దేవాలయం ఆవరణలో చక్రతీర్థం, వసంతోత్సవం, పూర్ణాహుతి, తిరుమంజన సేవ, అష్టోత్తర శత కలశస్నపనం, అలంకరణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకుడు వీర రాఘవాచార్యులు తెలిపారు.

నేడు బ్రాహ్మణి ముత్యాలమ్మ పండగ



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

పరవాడ: పరవాడ గ్రామంలో వెలసిన బ్రాహ్మణి ముత్యాలమ్మ తల్లి పండగను గురువారం వైభవంగా నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు. కోరిన కోర్కెలు తీర్చే తల్లిగా అమ్మవారు స్థానికుల పూజలను అందుకుంటున్నారు. ఉత్సవాల సందర్భంగా అమ్మవారిని దర్శించుకునేందుకు వేకువజాము నుంచి భక్తులు తరలివస్తారు. పసుపు కుంకుమలు సమర్పించి మొక్కులు చెల్లించి, పూజలు జరిపి తీర్థ ప్రసాదాలను స్వీకరిస్తారు. ఆలయ ప్రాంగణంలో మధ్యాహ్నం 12 గంటల నుంచి ఏర్పాటు చేసిన భారీ అన్నసమారాధనలో పరవాడ పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొని, అమ్మవారి దర్శనం అనంతరం అన్న ప్రసాదాన్ని స్వీకరిస్తారు. రాత్రికి డప్పులు, చిడతలు, తప్పెటగుళ్లు, డ్యాన్సులు, నేల డ్యాన్సులతో అమ్మవారిని వీధుల్లో ఊరేగిస్తారు. భారీ బాణసంచా కాల్పుల నడుమ అమ్మవారి అనుపు మహోత్సవం నిర్వహిస్తారు. భక్తుల కోసం పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలియజేశారు.

24న గురుకులంలో స్పాట్ అడ్మిషన్లు

- 5వ తరగతి, ఇంటర్ ఫస్టియర్‌లో మిగులు సీట్ల భర్తీ
- ప్రిన్సిపాల్ సత్యారావు

సబ్బవరం: సబ్బవరం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో మిగులు సీట్లను స్పాట్ అడ్మిషన్ల ద్వారా భర్తీ చేయనున్నట్లు గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సీహెచ్‌వీవీ సత్యారావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరానికి గాను 5వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో మిగులు సీట్లను భర్తీ చేయనున్నట్లు తెలియజేశారు. ఇప్పటికే ప్రవేశ పరీక్ష ద్వారా కొన్ని సీట్లు, ఫిజికల్ కౌన్సెలింగ్ ద్వారా కొన్ని సీట్లు భర్తీ చేసినట్లు పేర్కొన్నారు. సబ్బవరంలోని బాలుర గురుకుల పాఠశాలలో 5వ తరగతిలో ఎస్సీ కేటగిరీలో 23 సీట్లు, ఇంటర్మీడియట్‌లో ఎంఈసీ, సీఈసీలలో ఎస్సీ, ఎస్టీ, బీసీ కేటగిరీల్లో ఖాళీలు ఉన్నాయని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు మేఘాద్రిగెడ్డలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులానికి ఈ నెల 24వ తేదీన ఉదయం 9 గంటలకు నేరుగా హాజరు కావాలని పేర్కొన్నారు. విద్యార్థి ఆధార్ కార్డు, స్టడీ సర్టిఫికెట్, కుల ధ్రువీకరణ పత్రం, టెన్త్ మార్కుల జాబితాతో పాటు పాస్‌పోర్టు సైజ్ ఫొటో తీసుకురావాలని తెలియజేశారు. ఈ స్పాట్ అడ్మిషన్ల కౌన్సెలింగ్‌లో ఇదివరకే ప్రవేశపరీక్ష రాసి, సీటు రానివారికి తొలి ప్రాధాన్యం కల్పిస్తామని పేర్కొన్నారు. మిగులు సీట్లను ప్రవేశ పరీక్ష రాయని విద్యార్థులకు కేటాయిస్తామని వివరించారు.

ప్లే స్కూళ్లపై చర్యలు కోరుతూ ఫిర్యాదు



ఆర్జేడీకి వినతి పత్రం సమర్పిస్తున్న అప్సా ప్రతినిధులు

గాజువాక : ప్లే స్కూళ్ల ముసుగులో ఎటువంటి అనుమతులు లేకుండా నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ తరగతులతో పాటు 1, 2, 3 తరగతులను నిర్వహిస్తున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ఏపీ ప్రైవేట్ పాఠశాలల సంఘం (అప్సా) నాయకులు కోరారు. ఈ మేరకు సంఘం నాయకులు పాఠశాల విద్య రీజనల్ జాయింట్ డైరెక్టర్ బి.విజయ్ భాస్కర్‌ను బుధవారం కలిసి వినతి పత్రం అందజేశారు. అనుమతులు లేకుండా పాఠశాలలను నిర్వహిస్తున్న యాజమాన్యాలపై ప్రభుత్వ చర్యలు లేనికారణంగా జిల్లాల్లో పుట్టగొడుగుల్లా ప్రతి వీధిలోను ప్లే స్కూళ్లు పుట్టుకొస్తున్నాయని పేర్కొన్నారు. ప్లే స్కూల్ అంటే ప్రీప్రైమరీ తరగతులను మాత్రమే నిర్వహించాలని, వాటికి కూడా అనుమతులు మంజూరు చేయించాలని కోరారు. కాగా, వీటిపై తక్షణమే చర్యలు చేపడతామని ఆర్జేడీ పేర్కొన్నట్టు అప్సా సంఘం నాయకులు తెలిపారు. వినతి పత్రం సమర్పించినవారిలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సింహాచలం, ఫైనాన్స్ కార్యదర్శి పి.భాస్కరరావు, సీనియర్ సభ్యులు ఎం.జనార్ధన్, గణపతిరావు, సత్యం, రామ్మోహన్, సత్యనారాయణ తదితరులున్నారు.

సమాజానికి దర్పణం తెలుగు కథలు



మాట్లాడుతున్న శేఖరమంత్రి ప్రభాకర్

సీతంపేట: సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ద్వారకానగర్ ప్రిజమ్ కళాశాలలో 'ఉత్తమ తెలుగు సాహిత్యం' అనే అంశంపై కథా కచేరి కార్యక్రమం నిర్వహించారు. సభాధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ మానవ సంబంధాలు, విలువలు, సామాజిక సమస్యలను పరిష్కరించడానికి, విశ్లేషించడానికి కథలు దోహదపడతాయన్నారు. ఉత్తమమైన విలువల గల మంచి తెలుగు కథలకు తూర్పు దిక్కు ఉత్తరాంధ్ర, తెలుగు కథకుల్లో శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి, వేలూరి శివరామశాస్త్రి కథలు, కాంతం కథలు, అమరావతి కథలు, రావిశాస్త్రి కథలు, పాలగుమ్మి పద్మరాజు కథలు, కారా కథలు, కొకు కథలు, బలివాడ కాంతారావు కథలు, కవన శర్మ కథలు మొదలైన వాటిని వర్తమాన రచయితలు చదివి స్ఫూర్తి పొందాలన్నారు. డాక్టర్ డి.వి.సూర్యారావు మాట్లాడుతూ వర్తమాన తెలుగు ఉత్తరాంధ్ర తెలుగు కథల గురించి వివరించారు. ఎస్.విజయకుమార్, రచయితలు కె.జి.వేణు, సిహెచ్.చినసూర్యనారాయణ, కొత్తూరు రమణ, కప్పిలి భీమేశ్వరరావు, చిట్టిళ్ల నిర్మలాదేవి, ఉప్పల అప్పలరాజు, సోమయాజుల ప్రసాద్, సురేష్, అన్నపూర్ణేశ్వరరావు కథా పఠనం చేశారు.

మూలధనం చెల్లించండి

- లేదా బిల్లులో సర్దుబాటు చేయండి
- ఆర్ఈసీఎస్ షేర్ హోల్డర్ల డిమాండ్

అగనంపూడి: గ్రామీణ విద్యుత్ సహకార సంఘం (ఆర్ఈసీఎస్) ఏపీఈపీడీసీఎల్‌లో విలీనమై రెండున్నరేళ్లు దాటుతున్నా సభ్యుల మూలధనం తిరిగి చెల్లించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామీణ విద్యుత్ సహకార సంఘం (కశింకోట)ను ప్రభుత్వం ఏపీఈపీడీసీఎల్‌లో విలీనం చేసింది. ఆర్ఈసీఎస్‌లో విద్యుత్ కనెక్షన్ ఉన్న ప్రతీ సభ్యునికి రూ.3వందల వంతున మూలధనం వాటా ఉంటుంది. అగనంపూడి పరిధిలో 22,500 మంది, లంకెలపాలెం పరిధిలో 10,600 మంది సభ్యులు ఉన్నారు. మొత్తం ఈ పరిధిలో 33వేల మంది సభ్యులు ఉన్నారు. వీరి మూలధనం సుమారు కోటి రూపాయలు తిరిగి సభ్యులకు చెల్లించాల్సి ఉన్నా, వాటి గురించి ప్రస్తావన లేకుండానే విలీనం చేసేశారు. ఈ క్రమంలో తమ మూలధనం వాటాను వచ్చే విద్యుత్ బిల్లుల్లో సర్దుబాటు చేయాలని లేదా తిరిగి చెల్లించాలని షేర్‌హోల్డర్లు డిమాండ్ చేస్తున్నారు. విలీన ప్రక్రియ సమయంలో మూలధనం విషయం ప్రస్తావించకపోవడం, అనేక సంక్షేమ పథకాల ఊసు లేకపోవడంతో మూలధన వాటాదారుల్లో గందరగోళం నెలకొంది. లంకెలపాలెం, అగనంపూడి సెక్షన్ కార్యాలయాల పరిధిలో కోటి రూపాయల మూలధనం ఉండగా ఆర్ఈసీఎస్ పరిధిలో మొత్తం మూలధనం వాటా ఏమైందని వినియోగదారులు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంలో ఏపీఈపీడీఎల్ ఉన్నతాధికారులు చొరవ తీసుకొని మూలధన వాటాదార్లకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

స్టీల్‌ప్లాంట్ భూమిలో అక్రమ నిర్మాణం తొలగింపు

పెదగంట్యాడ: స్టీల్‌ప్లాంట్‌కు చెందిన స్థలాలను ఆక్రమించి నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని స్టీల్ ప్లాంట్ భూసేకరణ అధికారి డీఎస్ సునీత హెచ్చరించారు. 76వ వార్డు నడుపూరు గెడ్డ సమీపంలో స్టీల్‌ప్లాంట్‌కు చెందిన స్థలాన్ని ఓ వ్యక్తి ఆక్రమించి, షెడ్డు నిర్మించాడు. దీనిపై ఇటీవల కొంతమంది ఫిర్యాదు చేయడంతో స్పందించిన స్టీల్‌ప్లాంట్ ఆర్ఐ, సర్వేయర్, జీవీఎంసీ, సచివాలయ సిబ్బందితో ఆ స్థలాన్ని పరిశీలించారు. అక్రమంగా నిర్మించిన షెడ్డును తొలగించారు.